

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,93,871లు, వెండి 52.6 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



75 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం

- 8లో



రెచ్చిపోతున్న దొంగల ముఠా

- 8లో

న్యూస్‌రీల్‌

11న జాతీయ లోక్‌ అదాలత్‌

బరంపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈనెల 11న జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మోలయ రంజన్‌దాస్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదిలో జరగనున్న మొదటి జాతీయ లోక్‌ అదాలత్‌లో ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన మోటార్‌, బ్యాంక్‌ రుణాలు, సివిల్‌, రోడ్డు ప్రమాదాలు, బీమా, కార్మికులు తదితర కేసులకు పరిష్కారం మార్గం చూపించనున్నట్లు ప్రకటించారు. కక్షిదారులు దీనిని వినియోగించుకోవాలని గంజాం జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి కైలాస్‌చంద్ర సాహు సూచించారు.

రెవెన్యూ సంఘం అధ్యక్షుడికి అభినందనలు



బాలాజీని అభినందిస్తున్న కలెక్టర్‌ కమలోచన్‌, ఎస్పీ సుశ్రీ

కొరాపుట్‌: రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా తిరుపతి బాలాజీసాహు వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నవరంగ్‌పూర్‌ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ అశోక్‌ మెహతా సమావేశ మందిరంలో ఆయనను ఉన్నతాధికారులు సోమవారం అభినందించారు. కలెక్టర్‌ డాక్టర్‌ కమలోచన్‌ మిశ్రా, ఎస్పీ ఎస్‌.సుశ్రీ, ఏడీఎం భాస్కర్‌ రైతా, ఉన్నతాధికారులు మాజరయ్యారు. కలెక్టరేట్‌లో సీనియర్‌ క్లర్క్‌గా పనిచేస్తున్న బాలాజీ ఎన్నిక పట్ల సంఘం జిల్లా సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లు కొనసాగనున్నారు.

జూన్‌ నుంచి విశ్వవిద్యాలయం పనులు



జయపురం విక్రమ్‌దేవ్‌ కళాశాల

జయపురం: పట్టణంలోని స్వయంపాలిత విక్రమదేవ్‌ కళాశాలను ఈనెల 2న రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ విశ్వవిద్యాలయంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్‌ జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రానున్న విద్యా సంవత్సరం 2023–24లో కార్యకలాపాలు ప్రారంభించనుంది. దీనికి సంబంధించి జూన్‌ 1నుంచి యూనివర్సిటీ పనులు చేపట్టనున్నట్లు ఉన్నత విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీని పరిధిలో అవిభక్త జిల్లాలైన కొరాపుట్‌, రాయడగ, మల్కన్‌గిరి, నవరంగపూర్‌ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు అనుబంధంగా ఉంటాయి. ఇప్పటి వరకు ఈ కళాశాలలన్నీ బరంపురం విశ్వవిద్యాలయం పరిధిలో కార్యకలాపాలు కొనసాగించాయి.

అమర వీరునికి ఘన నివాళులు



నర్సింగ నాయక్‌ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ రంజన్‌శెరి

కొరాపుట్‌: మావోయిస్టుల దాడిలో ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరుడు నర్సింగ నాయక్‌కు మున్సిపల్‌ చైర్మన్‌ లలాటేందు రంజన్‌శెరి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని పుర్ణా కొరాపుట్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 2004 ఫిబ్రవరి 6న కొరాపుట్‌ జిల్లా కేంద్రంపై వందలాది మావోయిస్టులు దాడి చేశారు. పట్టణాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని, జైలులో ఉన్న మావోయిస్టులను విడిపించుకు పోయారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్‌ నివాసాలను దిగ్బంధించి, వారిని నివాసాలకే పరిమితం చేశారు. జిల్లా ఆయుధగారం లోని వందలాది తుపాకులు, వేలాది తూటాలు ఎత్తుకుపోయారు. ఆ సమయంలో నర్సింగ నాయక్‌ ఆయుధ గారం వద్ద విధుల్లో ఉన్నారు. మావోయిస్టుల మెరుపు దాడులకు భయపడి చాలా మంది భయపడి పరుగులు పెట్టగా.. నర్సింగ మాత్రం ఎదురు తిరిగారు. వారిని అడ్డుకొనే క్రమంలో తూటాలకు బలయ్యారు. ఈ నేపథ్యంలో ఏటా ఆయన సేవలు, త్యాగాన్ని స్మరిస్తూ విగ్రహం వద్ద సంతాప సభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం జరిగిన కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, విద్యార్థులు, సంఘ ప్రముఖులు పాల్గొని, నివాళులర్పించారు.

ఏళ్లు గడిచినా ఉద్యోగాలివ్వరా!



నిరసన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు



కర్మాగారం ప్రధాన గేటు వద్ద మొహరించిన పోలీసులు

- నిలదీసిన కొరాపుట్‌ ఎంపీ సప్తగిరి ఉల్కా
- ఉత్కళ అలూమిన కర్మాగారాన్ని ముట్టడించిన కాంగ్రెస్‌ శ్రేణులు
- స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్‌
- భారీగా మొహరించిన పోలీసులు

రాయగడ: కర్మాగారం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా ఈ ప్రాంత యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించక పోవడం దారుణమని కొరాపుట్‌ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కా నిలదీశారు. ఇప్పటికైనా స్పందించి, స్థానిక యువతకు పరిశ్రమలో ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. జిల్లాలోని కాసీపూర్‌ సమితి దొరగుడ వద్ద ఉన్న ఉత్కళ అలూమిన కర్మాగారాన్ని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సోమవారం ముట్టడించారు. ఎంపీ, జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ పండా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది కాంగ్రెస్‌ కార్యకర్తలు పాల్గొన్నారు. కర్మాగారం మెటీరియల్‌ గేట్‌ నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి, ప్రధాన గేటు వరకు చేరుకున్నారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్‌ షోలో ఆయన మాట్లాడుతూ... పరిశ్రమ ఏర్పడితే నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశించినప్పటికీ నిరాశే మిగిలిందన్నారు. అడిగిన వారిపై తప్పుడు కేసులు బనాయించి జైలు పాలు చేస్తుండటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం కాసీపూర్‌ సమితికి కొంతమంది మహిళలు కూలి పనులు ఇవ్వాలని కోరితే వారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపించారని గుర్తుచేశారు. ఇందులో ఉన్న ఓ గర్భిణి మృతిచెందిన విషయం చర్చనీయాంశమైనప్పటికీ కర్మాగారం యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమని మండిపడ్డారు. ఇప్పటికైనా తీరు మార్చుకొని, బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. లేకుంటే తమ పార్టీ తరుపున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భూములు తిరిగి అప్పగించాలి..

ఈ ప్రాంత ప్రజల జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశిస్తే.. కర్మాగారం మాత్రం బడా నేతలకు కాంట్రాక్టులను కట్టబెడుతోందని ఎంపీ విమర్శించారు. చిన్న పనులను కూడా వారి అనువాయిలకు అప్పగించడంతో స్థానిక యువత ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అలగే సమితిలోని కంసారిగుడ ప్రాంతంలో హిండాల్‌ కో కంపెనీ యాజమాన్యం అలూమిన రిఫైనరీ కర్మాగారం ఏర్పాటు చేస్తామని తక్కువ ధరకే ప్రజల నుంచి భూములు లాక్కొందని గుర్తుచేశారు. నేటికి 17 ఏళ్ల గడుస్తున్నప్పటికీ పరిశ్రమ ప్రస్తావన లేదన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి, కర్మాగారం ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో బాధితులకు తిరిగి తమ భూములను అప్పగించాలని కోరారు.

బీజేడీ ప్రభుత్వానికి కాలం చెల్లింది..

ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నామంటూ ప్రజలను మభ్యపెడుతున్న బీజేడీ పాలనకు కాలం చెల్లిందని ఎంపీ విమర్శించారు. రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్న నవీన్‌ సర్కార్‌లో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు దుర్గా పండా మాట్లాడుతూ ఇది ఆదివాసీలకు వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఆదివాసీలు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ పార్టీ తోనే సాధ్యమని తెలిపారు. జిల్లా ఆదివాసీ మహాసంఘం నాయకుడు అప్పలస్వామి కద్రక తదితర నాయకులు హాజరై ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న ఎంపీ సప్తగిరి ఉల్కా, పక్కన దుర్గా పండా

నిరుద్యోగి నిరసన..

కాసీపూర్‌కు చెందిన నిరుద్యోగ యువకుడు కర్మాగారం ప్రధాన గేట్‌ వద్ద తన విద్యార్హత ధ్రువపత్రాలతో సహా నిరసనకు దిగాడు. ఉపాధి, ఉద్యోగ అవకాశం కల్పించాలని పలుమార్లు ప్రాధేయ పడినప్పటికీ నుంచి ఎటువంటి స్పందన లభించలేదన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని చెబుతున్న పరిశ్రమ యాజమాన్యం మాటల్లో ఎటువంటి నిజం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అడుగడుగునా పోలీసు గస్తీ ఏర్పాటు చేయడంతో పాటు కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద భారీ ఎత్తున మొహరించారు.

రాష్ట్రపతి పర్యటన ఖరారు

- విస్తృత భద్రతా ఏర్పాట్లు: కమిషనర్‌ సౌమేంద్ర



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్‌: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2రోజుల పర్యటను రాష్ట్రానికి రానున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో ఆమె పర్యటించనున్నట్లు పోలీస్‌ కమిషనర్‌ సౌమేంద్ర ప్రియదర్శి సోమవారం వెల్లడించారు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్‌, కటక్‌ జంట నగరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రపతి భువనేశ్వర్‌లో 2 కార్యక్రమాలు, కటక్‌ ప్రాంతంలో ఒక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 11న ఉదయం స్థానిక లింగరాజ్‌ ఆలయాన్ని సందర్శించి, పూజల్లో పాల్గొంటారు. అలాగే భద్రతా వ్యవస్థను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర మహాపాత్రో ప్రత్యక్షంగా సమీక్షించారు. ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పర్యటన భద్రతా చర్యలపై కూడా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు కమిషనర్‌ వివరించారు.

రూల్‌ బుక్‌ ఆధారంగా..

రూల్‌ బుక్‌ నిబంధనల మేరకు అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. భువనేశ్వర్‌ బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాష్ట్రపతి కార్యక్రమాల వేదికలు, రాజ్‌భవన్‌ వరకు గట్టి భద్రతా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్‌ ప్రియదర్శి పేర్కొన్నారు. సెంట్రల్‌ ఇండస్ట్రియల్‌ సెక్యూరిటీ ఫోర్స్‌(సీఐఎస్‌ఎఫ్‌) సిబ్బంది ముర్ము రాక, బయలుదేరే సమయంలో విమానాశ్రయంలో భద్రత వ్యవస్థను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఆయా మార్గాల్లో విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ముందస్తు రిహార్సల్‌..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శనకు ముందు భద్రతా వ్యవస్థ యంత్రాంగా పూర్తిస్థాయి రిహార్సల్‌తో సిద్ధం అవుతాన్నారు. భద్రతా కార్యకలాపాల్లో పోలీసు బలగాల మోహరింపు వ్యవహారాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. తొలి రోజు పర్యటనలో భాగంగా 10న స్థానిక రమాదేవి మహిళా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం, ఉత్కళ్‌ మండప్‌లో జరిగే మరో కార్యక్రమానికి హాజరవుతారు. 1979లో రమాదేవి మహిళా కళాశాల ఆర్ట్స్‌ విభాగంలో ఆమె పట్టా పుచ్చుకున్నారు. అనంతర దశలలో ఈ కళాశాలకు పూర్తిస్థాయి విశ్వవిద్యాలయం గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతికి విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. ప్రస్తుతం ద్వితీయ స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. 11న కటక్‌ ప్రాంతం ఐసీఏఆర్‌లో ద్వితీయ ఇండియన్‌ రైస్‌ కాంగ్రెస్‌ను ప్రారంభించనున్నారు.

లారీ–ట్రక్కు ఢీ



ఘటనా స్థలంలో నుజ్జయిన ట్రక్కు

బరంపురం: జాతీయ రహదారి 16లో లారీ, ట్రక్కు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌ మృతిచెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై రంభా పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం వేకువజాము 4గంటల సమయంలో గంజాం జిల్లా సరిహద్దు రంభా–భల్లుగాం జాతీయ రహదారిలో బరంపురం వైపు వస్తున్న లారీని వెనుక నుంచి ట్రాక్కు ఢీకొంది. దీంతో ఖుర్దా జిల్లా జట్నీకి చెందిన ట్రక్కు డ్రైవర్‌ లోక్‌నాథ్‌ సాహు అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు, ఓడ్రాఫ్‌ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనం క్యాబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీయడంతో పాటు క్లీనర్‌ను రక్షించి రంభా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న, శివప్రసాదరావు, సేనాపతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ ఎన్నిక పట్టణంలోని రాజవీధిలో ఉన్న ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. గంజాం చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు ఈ.శివప్రసాదరావు, చైర్మన్‌ పీఎస్‌ఎస్‌ సేనాపతి ముఖ్య అతిథిగా హాజరై, ఈ ప్రక్రియను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 54 ట్రేడర్స్‌ నుంచి ప్రతినిధులు హాజరు కాగా, గజపతి చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడిగా బంగారు నగల వ్యాపారి(సూర్యా హాల్‌మార్క్‌) పాట్నూరు రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సంఘం కార్యదర్శిగా గేదెల మోహనరావు, కోశాధికారిగా బోయిన సంపత్‌కుమార్‌ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లా సంఘం అభివృద్ధికి యంత్రాంగంతో కలిసి పని చేస్తామని ప్రకటించారు. జిల్లాభివృద్ధి, నిత్యావసర, అత్యవసర వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉండేలా శ్రద్ధ కనబరుస్తానని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు అంధవరపు బాలజీ, నెహ్రూ తదితరులు పాల్గొని, నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

మైత్రిపూర్వక సంప్రదింపులతో సిబ్బంది సంక్షేమం



ప్రమోద్‌కుమార్‌ సహూను ఊరేగిస్తున్న రైల్వే శ్రామిక్‌ కాంగ్రెస్‌ కార్యకర్తలు

- రైల్వే ఖుర్దారోడ్‌ డీఆర్‌ఎం రింకేష్‌రాయ్‌



అభినందన సభలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం రింకేష్‌రాయ్‌

భువనేశ్వర్‌: సిబ్బంది సంక్షేమం, పరిరక్షణకు మైత్రిపూర్వక సంప్రదింపులు ఉత్తమ సోపానమని ఖుర్దారోడ్‌ డివిజన్‌ రైల్వే అధికారి రింకేష్‌రాయ్‌ సూచించారు. తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్‌ కాంగ్రెస్‌ ఖుర్దారోడ్‌ మండల సమన్వయకర్త ప్రమోద్‌కుమార్‌ సహూను స్థానిక కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌ఎం మాట్లాడుతూ గుర్తింపు పొందిన శ్రామిక్‌ సంఘాలు రైల్వే సిబ్బంది సంక్షేమానికి కంటికి రెప్పలా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ దిశలో ప్రమోద్‌కుమార్‌ సహూ సేవలు కొనియాడారు. కార్మిక నాయకునిగా సిబ్బంది మన్ననలు పొంది, ఉద్యోగ విరామం పొందడం అభినందనీయమన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పలువురు డివిజన్‌ అధికారులు, తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి రమేష్‌చంద్ర సాహు, సునీల్‌ భంజ్‌, అర్పిత మహంతి, సుమిత్ర పండా, ఇతర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రామిక్‌ కాంగ్రెస్‌ మీడియా వ్యవహారాల ప్రతినిధి లక్షీధర మహంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజల వద్దకే న్యాయసేవలు

- హింజిలికాట్‌ సివిల్‌ కోర్టు ప్రారంభించిన సీఎం నవీన్‌
- హాజరైన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ మురళీధర్‌



వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సివిల్‌ కోర్టును ప్రారంభిస్తున్న సీఎం నవీన్‌ పట్నాయక్‌

భువనేశ్వర్‌/బరంపురం: సీఎం నవీన్‌ పట్నాయక్‌ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా నియోజకవర్గం హింజిలికాట్‌ పట్టణంలో సివిల్‌ జడ్జి(సీనియర్‌ డివిజన్‌), అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి కోర్టు ఏర్పాటైంది. దీనిని ముఖ్యమంత్రి భువనేశ్వర్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సోమవారం ప్రారంభించారు. ఇందులో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్‌ జస్టిస్‌ ఎస్‌.మురళీధర్‌ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ స్థానిక కోర్టు ప్రారంభంతో హింజిలికాట్‌ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. పౌరుల ఇంటి ముంగిటకు సమర్థవంతమైన న్యాయ సేవలను అందుబాటులోకి తీసుకు రావాలనే సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం ఈ చర్య చేపట్టినట్లు ప్రకటించారు. న్యాయసేవల వ్యవస్థను సౌలభ్యం చేయడంలో ఇదో మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాంతపు పేద, బలహీన వర్గాలకు ఈ కోర్టు ప్రయోజనకరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. గంజాం న్యాయవాదులు ఈ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని, సమాజంలో సామాన్య పౌరులకు సత్వర న్యాయ సేవలు కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో సివిల్‌ జడ్జి కోర్టు ఏర్పాటు చేయడంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృషి అభినందనీయమన్నారు.

సేవల్లో జాప్యం లేకుండా..

కార్యక్రమంలో కటక్‌ నుంచి వర్చువల్‌ వేదికగా పాలుపంచుకున్న ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ మురళీధర్‌ మాట్లాడారు. ప్రజలకు న్యాయం చేయడంలో జాప్యం జరగకుండా హైకోర్టు, న్యాయశాఖ పలు చర్యలు చేపడుతున్నాయన్నారు. కోవిడ్‌–19 తాండవించిన విపత్కర రోజుల్లో కూడా హైకోర్టు నిరవధికంగా పని చేసిందని గుర్తుచేశారు. ప్రజలకు నిరంతరం న్యాయ సేవలను కల్పించడంలో న్యాయవ్యవస్థ దోహదపడిందన్నారు. కొత్త కోర్టుల ప్రారంభం, న్యాయాధికారుల నియామకం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, వివిధ కోర్టుల్లో కేసుల హేతుబద్ధీకరణ, న్యాయ వ్యవస్థ పనితీరును మెరుగు పరిచేందుకు అనేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. కొత్త కోర్టుల ఏర్పాటు ప్రక్రియలో ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ ఆధ్వర్యంలో ప్రభుత్వ సేవలను సీజే కొనియాడారు. ఈ సందర్భంగా గంజాం జిల్లా కలెక్టర్‌ దివ్యజోతి పరిధా ప్రత్యక్షంగా హాజరై, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హైకోర్టు రిజిస్ట్రార్‌ జనరల్‌ ప్రతాప్‌కుమార్‌ పాత్రొ అతిథులను స్వాగతించగా రిజిస్ట్రార్‌(జుడీషియల్‌) సుమన్‌మిశ్రా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్‌ జస్టిస్‌ బీఆర్‌ షడంగి, గంజాం జిల్లా, సెషన్స్‌ జడ్జి ఆనంద్‌చంద్ర బెహరా, హింజిలికాట్‌, గంజాం, ఛత్రపూర్‌ బార్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు, 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్‌, పాల్గొన్నారు.



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి ఆనంద్‌ బెహరా, కలెక్టర్‌ దివ్యజోతి పరిధా

క్లుప్తంగా

కాంగ్రెస్ శ్రేణుల నిరసన



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కొరాపుట్: అదానీ సంస్థలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నవరంగ్‌పూర్ లోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి మాట్లాడారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను అదానీ దోచుకున్నారని, దీనికి కేంద్రంలోని మోదీ సర్కార్ కొమ్ము కాస్తోందని ఆరోపించారు. అనంతరం ఎస్‌బీఐ కార్యాలయానికి చేరుకొని, నినాదాలు చేశారు.

న్యాయ విద్య తక్షణ ప్రవేశాల కోసం ప్రయత్నం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని న్యాయ విద్య (ఎల్ఎల్‌బీ) తక్షణ ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2008లో వర్సిటీ ఏర్పడినా, ఏయూ పీజీ కేంద్రంగా న్యాయ కళాశాల కొనసాగుతుందని, ప్రతి మూడేళ్లకు ఒక సారి బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియాకు గుర్తింపు కోసం రుసుం చెల్లిస్తున్నట్లు చెప్పారు. బీసీఐ గుర్తింపు సమస్యగా వర్సిటీలో ఉన్నత విద్యా మండలి ప్రవేశాలు నిలిపివేయటంతో బీసీఐ దృష్టికి సమస్య తీసుకు వెళ్లామని అన్నారు. బీసీఐకి గత ఏడాది నవంబర్‌లో రూ.8.50 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. ఈ నెల 3న బీసీఐ వర్చువల్‌గా సందర్శించిందని, కమిటీ సూచనల మేరకు మౌలిక వసతులు, లైబ్రరీ, మూట్ కోర్టు, బోధన సిబ్బంది వివరాలు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేశామని, బీసీఐ గుర్తింపు ధ్రువీకరణ పత్రం కోసం నిరీక్షిస్తున్నట్లు చెప్పారు. గుర్తింపు వస్తే మూడేళ్ల వరకు ఇబ్బంది ఉండదని, మూడేళ్ల తర్వాత రెన్యువల్ కమిటీ సందర్శించి చేస్తుందని తెలిపారు. గుర్తింపు వచ్చిన వెంటనే ఉన్నత విద్యామండలి అనుమతి మేరకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తామని వివరించారు.

11న ఘంటసాల వర్ధంతి

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 11న సాయంత్రం 6గంటలకు ఘంటసాల వర్ధంతి మహోత్సవం బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు డాక్టర్ నిక్కు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భరతనాట్య ప్రదర్శన, కళాప్రవీణ బందారు చిట్టిబాబు సంగీత నిర్వహణలో ఘంటసాల స్వరమాధురి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వస్తారని తెలిపారు. అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

అదానీ గ్రూప్‌పై సమగ్ర విచారణ జరిపించాలి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: అదానీ గ్రూప్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపుమేరకు సోమవారం శ్రీకాకుళంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందు సొమ్ము దాచుకోవడానికి ప్రజలు ఇబ్బందిపడేవారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయకరణ, ఎల్ఐసీ వంటి సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి ఆస్తులను ఆర్థికంగా దివాలా తీసే విధంగా బడా వ్యాపారవేత్తలకు వత్తాసు పలుకుతూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇటీవల అదానీ గ్రూప్స్ ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద రుణాల తీసుకుని తన వ్యాపారాల్లో వాడుకొని ఆర్థిక నేరాలకు పాల్పడుతూ వ్యాపార అవకతవకలకు పాల్పడిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో నాయకులు సనపల అన్నాజీరావు, దేశేళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

బూర్జ: సింగన్నపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో కొల్ల లింగన్నాయుడుకి చెందిన పూరిల్లు దగ్ధమైంది. మంటలను చూసిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ. 80 వేల నగదు, ఎనిమిది గ్రాముల బంగారం, ధాన్యం, బియ్యం కాలిబూడిదయ్యాయి. సుమారు రూ. రెండున్నర లక్షలు నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా అంచనా వేశారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి సోమవారం పది కిలోల బియ్యం అందజేశారు.

75 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం

- రూ.1.50 కోట్ల గంజాయి ధ్వంసం



గంజాయి తోటలను యంత్రాలతో తొలగిస్తున్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్ అడవ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండిమర పంచాయతీ గోబెల్ గ్రామంలో జిల్లా ఎక్సైజ్ తొలుత డ్రోన్ ద్వారా గంజాయి క్షేత్రాలను ఎక్సైజ్ గుర్తించారు. అనంతరం ఆకస్మికంగా దాడులు చేపట్టి, 75.15 ఎకరాల్లో పంటకు వచ్చిన గంజాయి మొక్కలను పూర్తిగా ధ్వంసం చేశారు. కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభాత్‌కుమార్ శెఠి, ఎస్‌డీపీఓ, పోలీసు సిబ్బంది కొండపై ఉన్న గోబెల్ గ్రామంలో దాడులు నిర్వహించారు. సుమారు 1,50,310 గంజాయి మొక్కలను యంత్రాలతో తొలగించి, నిప్పంటించారు. ధ్వంసం చేసిన సరుకు విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

80కిలోల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎక్సైజ్ అధికారి దీపక్‌కుమార్ సామల్ నేతృత్వంలో సుర్లుకొండ బ్యారేజ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో వేగంగా వస్తున్న ఆటోను అడ్డుకొని, సోదా చేయగా వాహనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో 80 కిలోల గంజాయిని గుర్తించారు. దీనికి సంబంధించి షేక్ ఇర్మాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, సరుకును స్వాధీనం చేసుకున్నారు. దీనిని చిత్రకొండ మీదుగా తెలంగాణాకు తరలిస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితుడు

మార్చి 25న బార్ అసోసియేషన్ ఎన్నికలు



మీడియాతో మాట్లాడుతున్న బార్ ఎన్నికల అధికారి బసంత పండా, పక్కన న్యాయవాదులు

బరంపురం: గంజాం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు మార్చి 25న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బసంత్‌కుమార్ పండా సోమవారం అధికారకంగా ప్రకటించారు. ఈ మేరకు సంఘం ప్రస్తుత కార్యదర్శి పితావాసి పండా బార్ సంఘం సభ్యుల జాబితాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 25న జిల్లా కోర్టు బార్ కార్యాలయంలో 2023-24 గంజాం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. సాయంత్రం 5గంటల నుంచి అభ్యర్థుల ఓట్ల లెక్కింపు చేపట్టి, విజేతలను ప్రకటిస్తామని వివరించారు.

ఎంకేసీజీలో 24 గంటలూ సేవలందించండి

- ఆస్పత్రి ఎదుట మానవ అధికారి శురక్షా మంచ్ ఆందోళన



ఎంకేసీజీ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న మానవాధికారి శురక్షా మంచ్

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజలకు జీవనాధారంగా ఉన్న బరంపురం ఎంకేసీజీ వైద్య కళాశాల ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో 24గంటలూ వైద్య సేవలు అందించాలని మానవ అధికారి శురక్షా మంచ్ కన్వీనర్ అవనికుమార్ గయా డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఎంకేసీజీ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్య నిపుణుల కొరత ఉందన్నారు. దీని ఫలితంగా చికిత్స కోసం వచ్చిన రోగులకు సేవలు నామమాత్రంగా పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. పలు సందర్భాల్లో ఆస్పత్రి పని వేళల్లోనే వైద్యులు వైద్యులు ప్రైవేటు ఆస్పత్రుల్లో దర్శనమిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఎండోక్రినాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గైనాలజీ, కార్డియాలజీ, న్యూరోసర్జరీ, కార్డియోథెరపీ విభాగాలకు నిబంధనల ప్రకారం ఒక్కో విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ తోసహా ఆరుగురు వైద్యులు ఉండాలని గుర్తుచేశారు. అయితే కేవలం ఒక్కో వైద్యుడితోనే నెట్టుకొస్తున్నారని విమర్శించారు. నెఫ్రాలజీలో ఉన్న వైద్యుడిని ఇటీవల బదిలీ చేయగా, ఆ స్థానాన్ని భర్తీ చేయలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు భర్తీ చేయడంతో పాటు రోగులకు 24 గంటలు సేవలు అందించాలని కోరారు.

రెచ్చిపోతున్న దొంగల ముఠా



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అనుభవ్ శుంకర్, వెనుక ముసుగుల్లో నిందితులు

- రాయగడలో వృద్ధురాలి మెడలో బంగారం చోరీ
- కొరాపుట్ దోపిడి కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో దారి దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. రాయగడలో వృద్ధురాలి మెడలో 6తులాల బంగారు గొలుసు దొచుకున్నారు. కొరాపుట్‌లో ఓ చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... జనవరి 31న కొరాపుట్ జిల్లాలోని ఉమ్రి గ్రామంలో జరిగిన చోరీ కేసును ఛేదించామని ఎస్పీ అనుభవ్ శుంకర్ వెల్లడించారు. దీనికి సంబంధించి ఎస్పీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో వివరాలను ప్రకటించారు. ఉమ్రి గ్రామానికి చెందిన పరశురాం ముదలి తన భార్య సుశీల ముదలితో కలిసి జిల్లా కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్ నుంచి హెడీఎఫ్‌సీ బ్యాంక్‌లో తన మిత్రునికి రూ.3 లక్షలు పంపించి డ్రా చేయించారు. ఆ డబ్బుని డ్రా తీసుకొస్తూ ట్రాఫిక్ జంక్షన్ వద్ద కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆగారు. ఇంతలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నగదు ఉన్న బ్యాగ్ ఎత్తుకుపోయారు. వెంటనే బాధితులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న ఎస్పీ.. ఎస్‌డీపీఓ మనోజ్ పూజారి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు గంజాం జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. వారి సెల్‌ఫోన్లపై నిఘా పెట్టి, దమంజోడి సమీపంలో మచ్చలాపుట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితులు అస్కా ప్రాంతానికి చెందిన ఎ.శివ, డి.రాజేంద్ర, ఎ.అర్జున్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్షా 70 వేలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్‌డీపీఓ మనోజ్ పూజారి, ఐఐసీ ధీరేన్ పట్నాయక్ పాల్గొనగా, వారిని ఎస్పీ శుంకర్ అభినందించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

రాయగడ: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ నాలుగో లైన్ కాలనీలో నివాసముంటున్న వృద్ధురాలు తుంగుడు రామమణి(67) మెడలోని 6తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. సమీపంలో నివసిస్తున్న తన చెల్లెలు బి.అరుణ ఇంటికి ఉదయం వెళ్లిన ఆమె.. ఇంటికి తిరిగి వస్తూ మధ్యలో కిరాణా దుఖాణం వద్ద కొద్దిసేపు కూర్చుంది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు సిగరెట్ కావాలని దుఖాణదారుడిని అడిగారు. ఆయన ఇచ్చేలోగానే వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తెంపుకొని అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని ఓ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు దుండగులను గుర్తించారు.



రాయగడ: సీసీ కెమెరాలో రికార్డయిన దుండగులు



రాయగడ: బాధితురాలు రామమణి



మల్కన్‌గిరి: సీసీ ఫుటేజ్‌లో నమోదైన దృశ్యాలు

గ్రీవెన్స్‌కు 90 వినతులు



గ్రీవెన్సులో ఫిర్యాదులు వింటున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్ కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇందులో జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం(రెవెన్యూ) ప్రదీప్‌కుమార్ నాయక్, ఐటీడీఏ పీఓ ఫాల్గుణి మాఝి, డిప్యూటీ కలెక్టర్ నట్వర గరోడో, గ్రీవెన్స్‌సెల్ నోడల్ అధికారి నర్మదా దొళాయి, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. పర్లాకిమిడి మున్సిపల్, రాణిపేట, బాగుసల, సిద్ధమణుగు, కెరండీ, కత్తల కవిటి పంచాయతీల నుంచి ప్రజలు హాజరయ్యారు. ఇందులో అత్యధికంగా 90 అభియోగాలు అందగా.. వాటిలో 82 వ్యక్తిగతం, 8 గ్రామస్థాయి సమస్యలపై వచ్చాయి. వీటిలో 16 వినతులను తక్షణమే పరిష్కరించారు. సామాజిక సురక్షా, భూపట్టాలు, ఇళ్ల నిర్మాణాలు, నీటి పారుదల, ఉపాధిహామీ పథకం, ఉన్నత విద్య, రోడ్డు సమస్యలపై వినతులు సమర్పించారు. పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖలకు బదిలీ చేశారు. అలాగే రెడ్‌క్రాస్ నిధుల నుంచి పేదరోగికి రూ.5 వేల సాయాన్ని కలెక్టర్ అందజేశారు.

విక్రమదేవ్ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ సన్మానం



విశ్రాంత అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

జయపురం: పట్టణంలోని స్వయంపాలిత విక్రమదేవ్ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా రిటైర్డు ప్రిన్సిపాళ్లు, విశ్రాంత అధ్యాపకులు, విద్యార్థి సంఘం మాజీ నాయకులను సోమవారం సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోపాల హల్దార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, గౌరవ అతిథిగా స్వతంత్ర అభివృద్ధి పరిషత్ ఉపద్రష్ట ప్రదీప్ మాఝి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం అధ్యక్షులు సత్యనారాయణ అధికారి, పంచానన మహాపాత్రో లకు నివాళులర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్స్ డాక్టర్ వివేకానంద మిశ్రా, డాక్టర్ సుభాష్‌చంద్ర రథ్, డాక్టర్ జి.సావిత్రి, రిటైర్డ్ ప్రొఫెసర్లు నయన కిశోర్ మహంతి, డాక్టర్ సుధారంజన్ మిశ్రా, డి.గోవిందరావు, రవీంద్రనాథ్ పట్నాయక్, యూనియన్ అధ్యక్షులు గుప్తప్రసాద్ దాస్ లను స్మారక పత్రాలతో సత్కరించారు. అలాగే కళాశాలను విశ్వవిద్యాలయంగా ప్రకటించటంపై వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల శ్రేయస్సుకు సహకరిస్తా

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం రూరల్: ఉద్యోగుల శ్రేయస్సుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తమనాయుడు, పలువురు సంఘ నాయకులు శ్రీకాకుళంలోని టౌన్‌హాల్‌లో మంత్రి ధర్మానను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎనిమిదోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన పురుషోత్తమనాయుడును మంత్రి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏపీ ఎన్‌జీవో సంఘం ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్యన సయోధ్య కుదురుస్తూ, కఠినమైన సందర్భాల్లోనూ అటు ప్రభుత్వానికి, ఇటు ఉద్యోగుల ఉన్నతమైన ప్రయోజనాలకు కట్టుబడి సంఘాన్ని క్రమశిక్షణతో నడపడం గొప్పవిషయమన్నారు. తాను ఉద్యోగులతో స్నేహితునిగానే కొనసాగడానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. పదవులు శాశ్వతం కాదన్నారు. ఉద్యోగులు బయటి వారు కాదని ప్రభుత్వంలో భాగమన్నారు. అందువల్లనే వారికి శ్రేయోభిలాషిగానే కొనసాగుతానని, వారి శ్రేయస్సుకు ఎల్లవేళలా సహకరిస్తానని చెప్పారు. తొలుత మంత్రి ధర్మానను ఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకులు పురుషోత్తమనాయుడు, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు.

నెమలి పింఛంపై 'కళాతపస్వి'

భారతీయ సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్. ఆయనకు నివాళులర్పిస్తూ అరసవల్లికి చెందిన రాహుల్ పట్నాయక్ జాతీయ పక్షి నెమలి పింఛంపై విశ్వనాథ్ సూక్ష్మ చిత్రాన్ని ఒక అంగుళం సైజులో చిత్రీకరించారు. దీన్ని వేసేందుకు రెండు గంటల సమయం పట్టిందని తెలిపారు.

–శ్రీకాకుళం కల్చరల్



అన్నింటా ఆదర్శం



- జి.సిగడాం మోడల్ పాఠశాలలో మెరుగైన విద్య
- ప్రధానమంత్రి యశస్వీ ఉపకార వేతనాలకు పలువురి ఎంపిక
- రాష్ట్రస్థాయిలో 36 మందికి ఏడుగురు ఈ పాఠశాల విద్యార్థులే..

జి.సిగడాం: పేరుకు తగ్గట్టుగానే ఆ విద్యాలయం అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. అహ్లాదకరమైన వాతావరణం, మౌలిక సదుపాయాలు, క్రమశిక్షణతో కూడిన విద్య, కార్పొరేట్‌కు దీటైన బోధనతో అందరి అభిమానాన్ని పొందుతోంది జి.సిగడాంలోని ఆదర్శ పాఠశాల. ప్రభుత్వ లక్ష్యాలను సాధించే దిశగా సిబ్బంది నిరంతరం పని చేస్తుండడంతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు నమోదవుతున్నాయి. విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం ఇక్కడ మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారు.

ఏడు వందల మంది విద్యార్థులు..

జి.సిగడాంలోని ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఆట, పాటలతోపాటు మెరుగైన విద్యను ఉపాధ్యాయ సిబ్బంది బోధిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన ల్యాబ్ అందుబాటులో ఉంది.

ఉపాకార వేతనాల్లో ప్రథమం

పీఎం యశస్వీ ఉపకార వేతనం పరీక్షల్లో రాష్ట్రస్థాయిలోనే ఈ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 36 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం-యశస్వీ) ఉపకార వేతనానికి ఎంపికైతే అందులో జి.సిగడాం మోడల్ స్కూల్ నుంచే ఏడుగురు ఉన్నారు. వీరిలో సింహాద్రి అర్చన, చదువుల తులసీ, ముల్లు భారతి, చిన్నాల మాధురి, కాకర్ల దేవిశ్రీ, మీసాల తరుణ్, ధర్మాన మేఘనాథ్ ఉండగా... వీరికి కేంద్ర ప్రభుత్వం 1.25 లక్షల రూపాయల చొప్పున డిగ్రీ చదువు పూర్తయ్యే వరకూ ఇవ్వనున్నారు. అలాగే తొమ్మిదో తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులు కూడా ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. వీరికి ఇంటర్మీడియెట్ వరకూ ఏటా రూ. 75 వేల చొప్పున ఇస్తారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తాచాటిన విద్యార్థులు

నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) టాలెంట్ పరీక్షల్లో కూడా ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గత విద్యా సంవత్సరంలో పది మంది ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరిలో డి.వివేక్, మక్క లహరి, ఎస్.ప్రదీప్, ఎ.సాలోమ్, జయకాంత్, పి.ఆనంద్, డి.గ్రీష్మ, బి.గాయిత్రి, వై.హేమదీపక, వి.శిరిభార్గవి, జి.సంజీన ఉన్నారు. ఏటా కనీసం పది నుంచి 15 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక అవుతున్నారు.


బాలికలకు వృత్తి విద్యా కోర్సు

వృత్తి విద్యలో కూడా బాలికలు రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మోడల్ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశ పెట్టింది. పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి వృత్తి విద్య కోర్సుల్లో అవకాశం కల్పిస్తున్నారు. ఈ ఏడాది 80 మంది విద్యార్థినులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. గత ఏడాది అగస్టు నెలలో 49 మంది బాలికలు తయారు చేసిన రికార్డులను ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు మంజు శర్మ, అనితసింగ్ పరిశీలించారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

వినోద కార్యక్రమాలు

మోడల్ విద్యాలయంలో దేశ, రాష్ట్ర, నాయకులు, ఉద్యమకారుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే వివిధ సేవారంగాల్లో ఉన్నవారి గురించి విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది తెలియజేస్తారు. వివిధ పండుగల సందర్భంగా విద్యార్థులతో వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంక్రాంతి, ఉగాది పర్వదినాల్లో తెలుగుదనం ఉట్టి పడేలా పిల్లలు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. రోజూ ప్రార్థన సమయంలో దేశ నాయకులు పేర్లలతోపాటు వారి చేసిన త్యాగాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరిస్తారు.

ఉపాకార వేతనానికి ఎంపికయ్యా..



నేను ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చదువుతున్నాను. 6 నుంచి టెన్త్ వరకూ ఇక్కడే చదివాను. పదో తరగతిలో 544 మార్కులు సాధించా. ప్రిన్సిపాల్ సూచన మేరకు పీఎం యశస్వీ ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసి.. విశాఖలో పరీక్ష రాశాను. ఉపకార వేతనానికి ఎంపిక కావడంతో ఏటా రూ. 1.25 లక్షలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది.

– సింహాద్రి అర్చన, ఇంటర్ విద్యార్థిని

క్రమశిక్షణతో కూడిన విద్య



ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నాం. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా దృష్టిసారించాలి. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం.

– చిరాపు రవికుమార్, అధ్యాపకులు, మోడల్ స్కూల్

అందరి సహకారంతోనే..



అందరి సహకారంతోనే ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. ఏడుగురు ఇంటర్ విద్యార్థులు కేంద్రం అందించే ఉపకార వేతనాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ అన్నా శ్యాముల్ లంక, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

మూగజీవాల మృతి కేసులో.. ముద్దాయికి జైలు, జరిమానా

తెర్లాం: పశువుల శాలకు నిప్పు అంటించి ఆవు, లేగదూడ మృతికి కారణమైన ముద్దాయికి బొబ్బిలి పీజేసీజే కమ్ జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ సరోజినమ్మ రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.4వేలు అపరాధ రుసుం విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.. ఈ మేరకు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన రెడ్డి సింహాచలం 2022 మార్చి 14న అదే గ్రామానికి చెందిన పైడియ్య పశువుల శాలకు నిప్పు అంటించాడు. ఈ ప్రమాదంలో పశువుల శాలలో ఉన్న ఆవు, లేగదూడ కాలిపోయి మృతిచెందాయి. బాధితుడు పైడియ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పీపీ నరేష్ వాదనలు వినిపించారు.

చీరకు నిప్పంటుకుని గాయాలు

పార్వతీపురం: మంచం కింద పెట్టిన కుంపటి కారణంగా ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం కొన గ్రామానికి చెందిన వెంకటమ్మకు కొద్ది సంవత్సరాలుగా మతిస్థిమితం లేకపోవడంతో విశాఖలో చికిత్స పొందుతోంది. అయితే ఆదివారం రాత్రి ఆమె మంచం కింద కుంపటి పెట్టి పడుకుంది. ప్రమాదవశాత్తు కుంపటిలో చీరకొంగు పడడంతో మంటలు చెలరేగి శరీరమంతా కాలిపోయింది. దీంతో స్థానికులు గమనించి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 నుంచి హిందీ పరీక్షలు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాసు)కు చెందిన పరీక్షలు ఈనెల 11 నుంచి రెండురోజుల పాటు జరగనున్నాయని హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు 11, 12 తేదీల్లో రెండురోజుల పాటు జరుగుతాయని, పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష పరీక్షలు 12న జరగనున్నాయని వివరించారు. హాల్ టికెట్ల నిమిత్తం ఫోన్ 99499 17365 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏఈపై విజిలెన్స్ విచారణ



జోగారావు నుంచి వివరాలు తీసుకుంటున్న విజిలెన్స్ సిబ్బంది

బొబ్బిలి: ఏపీఈపీడీసీఎల్ పట్టణ ఏఈ బి.సాంబశివరావుపై స్థానిక ఉపాధ్యాయుడు కురమాన జోగారావు ఇచ్చిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ సీఐ కె.కృష్ణ, ఎస్సై డీడీ నాయుడు, సిబ్బంది శ్రీనివాసరావులు విచారణ చేపట్టారు. ఈ మేరకు అధికారులు బొబ్బిలి వచ్చి జోగారావు చేసిన ఫిర్యాదుపై ఆయన నుంచి మరిన్ని వివరాలు నమోదు చేసుకుని వెళ్లారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దీనికి సంబంధించిన విచారణ చేశారు. వీధిలైటు వేసేందుకు ఏఈ సాంబశివరావు ఉపాధ్యాయుడు జోగారావును రూ.15వేలు లంచం డిమాండ్ చేసినట్టు ఉన్నతాధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

సీతంపేట: మండలంలోని మొగధార గ్రామంలో ఓ వ్యాపారి ఇంటివద్ద అక్రమంగా నిల్వ చేసిన 13 క్వింటాళ్ల 30 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వాటి విలువ రూ.50,540 ఉంటుందని అంచనా వేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు. బాధ్యుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మధుసూదనరావు, వీఆర్వో పద్మ, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తదితరులు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు చింతలపేట విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం శారద, పీడీ లక్ష్మణ్

గుర్ల: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.యశ్వంత్, పి.పైడిరాజు, ఎస్.వర్ధిని ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తలపడనున్నారు. వీరిని హెచ్ఎం శారద, పీడీ, సర్పంచ్ పతివాడ భాస్కరరావు పాఠశాలలో సోమవారం అభినందించారు.

చిట్టి ధాన్యం.. గట్టి ఆరోగ్యం..!



వ్యవసాయ పరిశోధన స్థానం

- చిరుధాన్యాల వినియోగంపై ప్రజల ఆసక్తి
- జిల్లాలో 3 వేల హెక్టార్లలో సాగు
- అధిక దిగుబడినిచ్చే వంగడాల కోసం శాస్త్రవేత్తల కృషి

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉండడంతో ప్రజలు వాటిని వినియోగించడానికి ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది.ఈ క్రమంలో రైతులకు అధిక దిగుబడినిచ్చే వంగడాలను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇప్పటికే అందించారు. ఇంకా అందించడానికి పరిశోధనలు చేస్తున్నారు.

12 చోడి రకాల విడుదల

జిల్లా కేంద్రంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 12 రకాల చోడి వంగడాలను శాస్త్రవేత్తలు విడుదల చేశారు. ఇంతవరకూ విడుదలైన విజయనగరం -1, విజయనగరం -2, సింహాద్రి, సూరజ్, చంపావతి, భారతి, శ్రీచైతన్య, హిమ, సువర్ణముఖి, వేగావతి, ఇంద్రావతి, గోస్తనీ రకాల వంగడాల్లో ఇంద్రావతిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేశారు.



పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్త

చిరు ధాన్యాలపై పరిశోధనలు



చిరుధాన్యాలపై వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధనలు చేస్తున్నాం. ఎక్కువగా చోడి రకంతో పాటు మిగిలిన వాటిపై కూడా చేస్తున్నాం. అధిక దిగుబడినిచ్చే వంగడాలను అందించడానికి కృషి చేస్తున్నాం.

– డాక్టర్ నర్సుపల్లి అనూరాధ, వ్యవసాయ పరిశోధన స్థానం

సామలు, కొర్రలపై కూడా పరిశోధనలు

చిరుధాన్యాల్లో చోడితో పాటు సామలు, కొర్రలు, అండుకొర్రలు, అరిగలు, వరిగలపై కూడా పరిశోధనలు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో ఏ రకం చిరుధాన్యాలను సాగు చేయవచ్చన్న దానిపై కూడా దృష్టి సారించారు. చిరుధాన్యాలు జిల్లాలో 3 వేల హెక్టార్ల వరకు ప్రస్తుతం సాగవుతున్నాయి. చోడి సాగు 2 వేల హెక్టార్లలో జరుగుతుండగా.. సామ, కొర్ర, అందు కొర్రలు, అరికలు, వరిగలు మిగిలిన వెయ్యి హెక్టార్లలో సాగవుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజల నుంచి వచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, డీఆర్‌ఓ జి.వెంకటరావుతో కలిసి నిర్వహించిన కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రజల నుంచి 90 అర్జీలు స్వీకరించారు.

వినతుల్లో కొన్ని ఇలా..

పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో ఉన్న రహదారిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని నరసింగ సాహు వినతిపత్రం సమర్పించారు.

- సర్వే నంబర్ 536–1లో డి పట్టా వేరే వారి పేరు మీద నమోదు చేసి ఉందని, తన పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన జె.ప్రసాదరావు కోరారు.
- సర్వే నంబర్ 117–2ఆ, 119–7, 120–2, 120–6కు పాస్ పుస్తకం ఇప్పించవలసిందిగా పార్వతీపురం మండలం అడ్డాపు శీల గ్రామానికి చెందిన డి. మణిభూషణరావు కోరారు.
- జనవరి 8వ తేదీ నుంచి ధాన్యం ప్రొక్యూర్ మెంట్ నిలిచిపోవడంతో ఇబ్బందికి గురవుతున్నామని, ధాన్యం మిల్లుకు చేరే ఏర్పాటు చేయాలని జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన రెడ్డి.గంగాభవాని దరఖాస్తు అందజేశారు.
- మక్కువ మండలం ఎ వెంకంపేట గ్రామ సచివాలయం పరిధిలో గ్రీన్ అంబాసిడర్‌గా మూడు సంవత్సరాలు నుంచి విధులు నిర్వహిస్తున్నానని, గడిచిన 10 మాసాలుగా జీతం రావడం లేదని, జీతం అందేలా చేయాలని గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మణ్ కోరాడు.
- పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీలో గల ధాన్యం జనవరి నుంచి ఆన్‌లైన్ అవడం లేదు. రైతుల దగ్గర సుమారు 700 బస్తాలు ధాన్యం నిలిచిపోయాయి. ఆర్‌బీకే ద్వారా ధాన్యాన్ని సేకరించాలని పంచాయతీలోని చలమవలస గ్రామానికి చెందిన సీహెచ్. శ్రీను కోరారు.

వికలాంగులకు ప్రత్యేక కార్యక్రమం

దివ్యాంగ అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఈ కార్యక్రమానికి హాజరుకాగా పలువురు దివ్యాంగులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, పీఆర్‌ఎస్‌ఈ ఎంబీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఒ.ప్రభాకరరావు, డ్వామా పీడీ కె. రామచంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్‌ఎన్ మూర్తి, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'విదిల్చేలా పటిష్ట ప్రణాళిక


- విద్యాసంస్థల్లో ఫిర్యాదుల బాక్సుల ఏర్పాటు
- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్, మాదక ద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగంపై నిఘాపెంచి దాడులు చేయాలన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. దీని కోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని కోరారు. మద్యం షాపుల్లో సీసీ కేమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ యాక్షన్ ప్లాన్ నోడల్ ఆఫీసర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్, డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, ఔషధ నియంత్రణశాఖ ఏడీ కె.రజిత, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.రత్నం, బీసీ సంక్షేమాధికారి యశోధనరావు, మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ కేవీఎస్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణాధికారి ఎ.సత్యనారాయణ, జిల్లా యువజన సమన్వయాధికారి విక్రమాదిత్య, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఫ్యాకల్టీ సదస్సు ప్రారంభం



ముఖ్యఅతిథిని సత్కరిస్తున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ కళాశాలల్లో అత్యాధునిక సాంకేతిక విద్యా బోధన నైపుణ్యాలు మెరుగుపడాలని ఆ దిశగా బోధన సిబ్బంది తయారవ్వాలని వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని కల్యాణి యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అనిర్బన్ ముఖోపాధ్యాయ హితవు పలికారు. స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాలలో యూనివర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ అంశాలపై నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజజీవితంలో ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సి, మిషన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక కోర్సులపై అధ్యాపకులకు ముందుగా అవగాహన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఐఐటీ, ఎన్ఐటీ, స్టేట్ యూనివర్సిటీలు, పరిశ్రమల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ జి.జయసుమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, యూనివర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్ కె.చంద్రభూషణ్, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ కె.బాబు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

బొబ్బిలి: భక్తుల జయజయ ధ్వానాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణాల నడుమ పాతబొబ్బిలి కూడలి వద్ద 27 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. పూజల్లో దీక్షధారులతో పాటు వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మండల పరిషత్ అధ్యక్షుడు శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి ఆలయం

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గజపతినగరం రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా చంపావతి నదినుంచి ట్రాక్టర్ల లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని ఎ స్సై గంగరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరంగరాజుపురం గ్రామం వద్ద బెల్లాన లక్ష్మునాయుడు, చిప్పాడ సురేష్‌లను, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు.

జాతీయ సైన్సు సదస్సుకు రాజాం విద్యార్థులు

రాజాం: బీహార్ రాష్ట్రం పాట్నా పట్టణంలో మార్చి 9 నుంచి 16 వరకు జరగనున్న 28వ జాతీయ సైన్సు సదస్సుకు రాజాంలోని వరలక్ష్మి సెయింటాన్స్‌లో 8వ తరగతి చదువుతున్న కె.ప్రసీద్, టి.మోహన్ ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లార్డ్ మేరీ సోమవారం తెలిపారు. 'వ్యర్థాల నుంచి ఉపయోగాలు' అనే అంశంపై సదస్సులో మాట్లాడతారన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు సిస్టర్ సిసిలియన్, బాలభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రమేష్ అభినందించారు.



పాఠశాల ఆవరణలో ఉన్న పూరిళ్లు

చదువుల నిలయం.. ఆక్రమణల వలయం

ఈ చిత్రం చూశారా.. వీరఘట్టం మండలం తెట్టంగి ఉన్నత పాఠశాల మైదానంలో వేసిన పూరిపాకలు ఇవి. దశాబ్దాల తరబడి ఇలా బడి ఆవరణలోనే 11 కుటుంబాలు పూరిళ్లు కట్టుకుని నివసిస్తున్నాయి. తరగతుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నా వీరు మాత్రం ఖాతరు చేయడం లేదు. ఎకరా విస్తీర్ణం కలిగిన మైదానంలో అధిక భాగాన్ని ఆక్రమించేశారు. పశువులు, కోళ్ల సంచారం, ఆయా కుటుంబాల కేకలు, అరుపులతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందని, తక్షణమే ఖాళీ చేయాలని గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జల్లేపల్లి మాధవి వచ్చి నచ్చజెప్పినా వీరి నుంచి స్పందన శూన్యం. పాఠశాలలో చదువుతున్న 132 మంది విద్యార్థులు సమస్యల నడుమ చదువులు సాగిస్తున్నారు. మైదానం ఆక్రమణలకు గురికావడంతో ఆటలకు దూరమవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని గ్రామస్తులు చెబుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ఆక్రమణలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాళీ చేయిస్తానని ప్రస్తుత తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఏం చేస్తారో చూడాలి మరి.!

– వీరఘట్టం



తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్



పూరిల్లు ఖాళీ చేయాలని చెబుతున్న గత తహసీల్దార్ మాధవి (ఫైల్)

మిగులు ధాన్యం సరఫరాకు అనుమతించాలి

- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ విక్రాంత్ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన రైతులకు సంబంధించి 17వేల మెట్రిక్ టన్నుల ధాన్యం యాప్‌లో నమోదు కాగా ఇటీవల 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించారన్నారు. మిగిలిన 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరాకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎస్పీ రహదారి నుంచి చిదిమి గ్రామం వరకు, సీఎస్‌పీ రహదారి నుంచి ఆర్‌బీఆర్ పేట మీదుగా జంపరకోటవరకు రహదారి మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు వీరఘట్టం ఎంపీపీ డి.వెంకటరమణ నాయుడు, కోట అజయ్ కుమార్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక



సమస్యలు వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చి సమస్యలు తెలియజేస్తున్న ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె 33 ఫిర్యాదులు అందుకున్నారు. బాధితుల సమస్యలను విని, సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదులు పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

పార్వతీపురంటౌన్: బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదు దారుల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలపై ఎస్పీ సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు వివరాలు తెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, దిశ డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్, డీసీఆర్బీ సబ్‌ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదు
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- బోర్డు సమావేశం ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం
- శివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష



శివరాత్రి ఉత్సవాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు,ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. శాఖల వారీగా అధికారులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. వైద్య సేవలు అందించడంతో పాటు అంబులెన్సులను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. తమిళనాడులో అరుణాచలేశ్వరుల పర్వతంపైన ఏ విధంగా శిఖర దీపాన్ని వెలిగిస్తారో అదే విధంగా రామతీర్థంలో కూడా మహాశివరాత్రి పర్వదినాన కోదండ రామస్వామివారి పర్వతంపై సొంత ఖర్చుతో శిఖరదీపం ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. క్షేత్ర పరిసర ప్రాంతాల్లో అదనపు విద్యుత్ కాంతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు బాణసంచా సంబరాన్ని జరిపిస్తున్నామన్నారు.

బోర్డు మీటింగ్ నిర్వహించకపోవడంపై ఆగ్రహం

రామతీర్థం ట్రస్టు బోర్డు ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్నా బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయకపోవడంపై దేవస్థాన ఈఓ ప్రసాదరావుపై ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు సమావేశం ఏర్పాటు చేయలేకపోయారని ప్రశ్నించారు. పద్ధతి ప్రకారం సభ్యులకు సమాచారం అందించి త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ నిర్వహణ, ఖర్చుల వివరాలను బోర్డు సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సూర్యకళ, అప్పారావు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, సీఐ విజయనాథ్, ఎస్సై నారాయణరావు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం

రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రప్రభువు పట్టాభిషేక మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, రుత్వికుల సమక్షంలో వేకువజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు సాగాయి. సీతారామచంద్ర ప్రభువుల వారిని ఆస్థాన వెండి మండపంలో వేంచింపజేసి పట్టాభిషిక్తుని చేశారు. సాయంత్రం 6 గంటలకు వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పుష్పార్చన జరిపారు. అనంతరం ద్వాదశిఆరాధన, సప్తావరణ జరిపించి స్వామివారికి పవళింపు సేవ, ఆరగింపు తదితర కార్యక్రమాలను చేపట్టారు.